క్లుప్తంగా

డాక్టర్ వెంకటరమణకు ఘన సన్మానం



డాక్టర్ వెంకటరమణను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): పదవీ విరమణ చేయనున్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. వెంకటరమణను ఘనంగా సన్మానించారు. బుధవారం ఆసుపత్రిలోని గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వెంకటరమణ గైనకాలజీ విభాగానికి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ కొనియాడారు. రిటైర్‌మెంట్ ప్రతి ఒక్కరికీ వస్తుందని, పదవీ కాలంలో వారందించిన సేవలను గుర్తు చేసుకుంటూ స్ఫూర్తిపొంది పనిచేయాలని చెప్పారు.

23న నంది నాటక పోటీలు



పోసానితో కర్నూలు కళాకారులు

కర్నూలు కల్చరల్: నంది నాటక పోటీలు డిసెంబర్ 23వ తేదీన గుంటూరులో నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. నంది నాటక పోటీలకు ఎంపికైన నాటక సమాజాలతో బుధవారం విజయవాడలో చలన చిత్ర నాటక రంగ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్, సినీ నటులు, పోసాని మురళీ కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగిందన్నారు. నంది నాటక పోటీలకు అన్ని సమాజాలు సహకరించాలని, నాటక ప్రదర్శనలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని పోసాని పేర్కొన్నారన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సభ్యులు గాండ్ల లక్ష్మన్న, ఆంజనేయులు, కర్నూలు కళాకారుల సంఘం అధ్యక్షులు వి.వి. రమణారెడ్డి, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పోసానిని కలిశారు.

చిన్నారులందరికీ టీకాలు ఇప్పించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశాలు వారి పరిధిలోని గర్భిణులు, చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్‌కు పిలిచి టీకాలు వేయాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యువిన్, హెచ్‌ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అనంతరం ఆయన గర్భిణులకు ఐరన్ మాత్రలు, పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్-ఎ సిరప్‌లను పంపిణీ చేశారు.

చిన్నారులతో పనులు చేయించొద్దు

కర్నూలు(రాజ్‌విహార్): చిన్నారులు, బడి ఈడు పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న హెచ్చరించారు. బుధవారం స్థానిక ధర్మపేటలోని తమ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల హక్కుల పరిరక్షణ కోసం చర్యలు చేపట్టిందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా వారికి పనులకు పంపకుండా బడికి సక్రమంగా పంపేలా చూడాలని, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

మతోన్మాద బీజేపీని గద్దె దించాలి



సంతకాల సేకరణలో కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : దళితుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న మతోన్మాద బీజేపీని గద్దె దించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు పిలుపునిచ్చారు. దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కేవీపీఎస్ న్యూసిటీ కమిటీ నగర అధ్యక్షుడు జి.ఏసు ఆధ్వర్యంలో వీకర్ సెక్షన్ కాలనీ, షరీన్ నగర్‌లలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..దళితులకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. డిసెంబర్ 4న దళితుల సమస్యలపై రాష్ట్రపతికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భాస్కర్, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పదిలం!

- జిల్లాలో విస్తృతంగా ఆయుష్మాన్ భారత్ ఐడీ కార్డుల జారీ
- ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత హెల్త్ ఐడీ
- దేశంలో ఎక్కడైనా కచ్చితమైన చికిత్స అందే అవకాశం
- ఐడీ తెరిస్తే రోగికి సంబంధించి వ్యాధులు, చికిత్స వివరాలు ప్రత్యక్షం
- వాటి ఆధారంగా రోగులకు మెరుగైన వైద్యం



హెల్త్ ఐడీ జనరేట్ చేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): చాలా మంది వారి ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం ఫైలింగ్ చేసుకోరు. వైద్యుల వద్ద చికిత్స పూర్తికాగానే రిపోర్టులు, మందుల చీటీలను ఎక్కడో పారేస్తారు. మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లాలంటే అవి లభించవు. దీంతో వైద్యపరీక్షలు మళ్లీ చేయించుకోవాల్సిన పరిస్థితి. లేకపోతే కచ్చితమైన చికిత్స అందించేందుకు డాక్టర్‌కు వీలు కాదు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీలను జనరేట్ చేస్తున్నారు. ఈ ఐడీ కార్డులోనే వ్యక్తిగత వ్యాధులకు సంబంధించిన అన్ని వివరాలు నమోదై ఉంటాయి. కార్డు దగ్గర ఉంటే చాలు.. దేశంలో ఎక్కడైనా, ఏ డాక్టర్ వద్దనైనా కచ్చితమైన వైద్యం అందుకునే అవకాశం ఏర్పడుతుంది.

కచ్చితమైన వైద్యసేవలను ప్రజలు అందుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా అమలు చేస్తున్నాయి. ఈ అకౌంట్‌లో ఒక్కసారి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై కార్డు పొందితే చాలు దేశంలో ఎక్కడైనా, ఏ ఆసుపత్రిలోనైనా చికిత్స తీసుకోవచ్చు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర ఆరోగ్య సమస్యలున్న వారు వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు ఆరోగ్య సమస్యలు వస్తే వారికి వెంటనే చికిత్స అందించేందుకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ మేరకు జిల్లాలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) కార్డు జారీ ప్రక్రియ వేగవంతమైంది. ఒకవైపు వైద్య సిబ్బంది ఎస్‌సీడీ సర్వే చేస్తూనే మరోవైపు అదే వివరాలతో హెల్త్ ఐడీ జనరేట్ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 23,59,000 జనాభా ఉంటే అందులో ఇప్పటికే 20,52,330(87శాతం) మందికి ఆభా ఐడీలు నమోదు చేశారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో 87 శాతం మందికి ఐడీ వివరాల నమోదు ప్రక్రియ పూర్తయ్యింది.

హెల్త్ ఐడీ కార్డు జారీ ప్రక్రియ ఇలా...

జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల్లోనే 532 మంది ఏఎన్‌ఎంలు రోజుకు 500లకు పైగా ఆయుష్మాన్ భారత్ యాప్‌లో ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేసి హెల్త్ ఐడీ జనరేట్ చేస్తున్నారు. అయితే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కారణంగా కొద్దికాలం ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇటీవల ఈ కార్యక్రమం ముగియడంతో మళ్లీ హెల్త్ ఐడీ జనరేట్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎవరికి వారు వ్యక్తిగతంగా సైతం హెల్త్ ఐడీని జనరేట్ చేసుకునే అవకాశం ఉంది. ఇందుకు గాను ముందుగా ఆయుష్మాన్ భారత్ యాప్‌లో మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్ వివరాలు, వయస్సు, ఎత్తు, బరువు, ఇతర ఆరోగ్య వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయడం ద్వారా హెల్త్ అకౌంట్ పొందవచ్చు. జిల్లాలో పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా కూడా ఈ సేవలను అందుకోవచ్చు.

ఆసుపత్రుల్లో కాగితపు రహిత చికిత్స

ప్రస్తుతం ఆసుపత్రికి వెళ్లిన రోగిని డాక్టర్ పరీక్షించడం, ఆ తర్వాత అతని వివరాలను ఓ కాగితంపై రాయడం, అవసరమైన వైద్యపరీక్షలు చేయించడం, కాగితం రూపంలో వచ్చిన రిపోర్టులను ఫైల్ చేయడం, చికిత్స అందించడం చేస్తున్నారు. ఆభా కార్డు అమలైతే రోగి వివరాలు ఎప్పటికీ ఆన్‌లైన్‌లో ఉండనున్నాయి. ఈ మేరకు ప్రతి వ్యక్తికి ఒక యూనిక్ ఐడీని క్రియేట్ చేస్తున్నారు. వీటినే హెల్త్ ఐడీగా పరిగణించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఆధార్‌నెంబర్‌తో యూనిక్ ఐడీ నెంబర్‌ను పొంది డిజిటల్ కార్డు అందుకోవచ్చు. లేదా నేరుగా ఎవ్వరికి వారు ఏబీడీఎం వెబ్‌పేజీలోకి వెళ్లి ఆధార్ నెంబర్ నమోదు చేస్తే హెల్త్ ఐడీ వస్తుంది. దీనినే డిజిటల్ కార్డుగా పరిగణిస్తున్నారు. తద్వారా భవిష్యత్‌లో పేపర్‌పై వైద్య చికిత్సల గురించి రాయడం గాకుండా నేరుగా వారి వ్యక్తిగత హెల్త్ ఐడీలోనే వివరాలు నమోదవుతాయి. తద్వారా కాగితపు రహిత చికిత్స సులభమవుతుంది.

హెల్త్ ఐడీ వివరాలు గోప్యంగా ఉంచుతాము



ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ(ఆభా) కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో మళ్లీ ప్రారంభమైంది. జిల్లాలో ఇంకా ఎవ్వరైనా హెల్త్ ఐడీలో వివరాలు నమోదు చేయించుకోకపోతే వెంటనే చేయించుకోవాలి. ప్రతి వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య వివరాలు గోప్యంగా ఉంచుతారు. కేవలం చికిత్స చేసే వైద్యులకు మినహా ఇతరులకు ఎవ్వరికీ ఈ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించవు. దీనిపై ఎలాంటి అనుమానాలు ఉంచుకోకుండా హెల్త్ ఐడీకి సహకరించాలి. –హేమలత, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

హెల్త్ ఐడీ కార్డు ఉపయోగాలు



ఆభా హెల్త్ ఐడీ కార్డుల నమూనా

ఈ కార్డు ద్వారా దేశంలో ఏ ఆసుపత్రికి వెళ్లినా సరే కంప్యూటర్‌లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ నెంబర్ నమోదు చేయగానే రోగి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది, తద్వారా ఆ వ్యక్తి అనుమతితో ఆన్‌లైన్‌లో వివరాలను వైద్యులు తెలుసుకుని చికిత్స అందిస్తారు. మొబైల్ ఫోన్ లేకపోతే నేరుగా బయోమెట్రిక్ (వేలిముద్ర) వేస్తే ఆన్‌లైన్‌లో వివరాలు వెల్లడవుతాయి. ఆన్‌లైన్‌లో రోగి పేరు, ఊరు, అతని ఆరోగ్య వివరాలు, గతంలో చికిత్స అందుకున్న వివరాలు, చేయించుకున్న వైద్యపరీక్షల వివరాలు ఉంటాయి. వీటన్నింటినీ విశ్లేషించి వైద్యులు చికిత్స అందించేందుకు సులభమవుతుంది. షుగర్, బీపీ, ఆస్తమా, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వారి వివరాలను ఐడీలో నిక్షిప్తం చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవల్లో ఆలస్యం లేకుండా సత్వర చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది. రక్తం గ్రూపు వివరాలు కూడా ఉంటే అవసరమైతే వెంటనే రోగికి రక్తాన్ని అప్పటికప్పుడు అందించే వీలవుతుంది. దీంతో పాటు ఎవ్వరికైనా ప్రమాదం సంభవించినప్పుడు అతని ఆరోగ్యపరిస్థితి గురించి పూర్తి వివరాలు హెల్త్ ఐడీలో నమోదై ఉండటంతో సత్వర చికిత్స అందించేందుకు వీలవుతుంది. గతంలో ఆ వ్యక్తికి నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలు కూడా ఐడీలో ఉండటంతో మెరుగైన వైద్యం అందించేందుకు వీలవుతుంది.

బాల బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఆడపిల్లలను వద్దు అనుకోకుండా వారి పట్ల వివక్ష చూపకుండా బాలబాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. బుధవారం బి.తాండ్రపాడులోని పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో అనీమియా స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష నిర్మూలన, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణపై మాట్లాడారు. ఆడపిల్లల శాతం తగ్గడం ద్వారా కలిగే దుష్పరిణామాలను వివరించారు. లింగనిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమని, దీనిని అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వైద్యులు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షకు గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త క్రిష్ణవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు (కార్పొరేటర్) శ్రీనివాసులు అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి'- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనలో తేడాను గమనించాలన్నారు. 82వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ర్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, శివ, సుభాన్, సచివాలయ కన్వీనర్లు దుర్గాప్రసాద్, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయాలి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు : బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు పారదర్శకంగా చేపట్టాలని పాణ్యం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 ఎన్ని కొత్త ఓట్లు నమోదు చేశారు, ఎన్ని తొలగించారు, ఎన్ని అడ్రస్‌లు మార్చారని నివేదికలను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో వారి పోలింగ్ కేంద్రంలో అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బీఎల్‌వోలు పని చేయకపోతే సూపర్‌వైజర్లు ఎఈఆర్వోలకు నివేదిక అందించాలని సూచించారు. ఒకే ఇంట్లో 10 మంది కంటే ఎక్కువ ఓట్లు ఉంటే క్షుణంగా పరిశీలించాలన్నారు. సమావేశానికి హాజరుకాని వారిపై, విధుల పట్ల అలసత్వంగా ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేష్ బాబు, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, ఎన్నికల డీటీ అనురాధ పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక క్యాంపు



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 2 , 3 తేదీల్లో నగరంలోని పోలింగ్ స్టేషన్లలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సెక్టోరల్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లతో కమిషనర్ సమావేశమై మాట్లాడారు. పోలింగ్ స్టేషన్లలో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక క్యాంపుల్లో ఓటరు నమోదు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను బూత్ లెవల్ ఆఫీసర్లు స్వీకరించాలన్నారు. అలాగే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 15,16,17 తేదీల్లో కర్నూలులో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రాన్స్ శివరాం, ప్రసాదు, మల్లెల పుల్లారెడ్డి, జేఎన్ శేషయ్య, జె.నాగేశ్వరరావు, టి. రాముడుతో కలసి ఆయన లోగోను ఆవిష్కరించారు.

ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలోకి కలెక్టరేట్ ఉద్యోగులు



ఎస్ఎస్ఏ సమావేశం మందిరం నుంచి విధులు నిర్వహిస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ సముదాయంలోని డీఆర్వో, పరిపాలనాధికారి, ఏ, బీ,సీ, డీ, ఈ, ఎఫ్, జీ సెక్షన్ల ఉద్యోగుల కార్యాలయాలను సర్వశిక్ష అభియాన్ సమావేశానికి మార్చారు. ప్రస్తుతం ఉన్న సముదాయంలో పునర్నిర్మాణ(రెన్యువేషన్) పనులు చేపట్టడానికి అనువుగా ఆయా కార్యాలయాలను అక్కడికి తరలించారు. పనులు పూర్వగానే మళ్లీ ఉద్యోగుల కార్యాలయాలను మార్చుతారు. అప్పటి వరకు ఉద్యోగులు ఎస్ఎస్ఏ సమావేశ మందిరం నుంచే విధులు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు గమనించాలని అధికారులు కోరారు.

అవీ-ఇవీ

20న భగవద్గీత పోటీలు

కర్నూలు కల్చరల్: గీతా జయంతిని పురస్కరించుకుని డిసెంబర్ 20వ తేదీన ఇస్కాన్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు పేర్కొన్నారు. బుధవారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొదటిసారి భగవద్గీత రాత పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ విభాగంలో 5,6,7 తరగతులకు విద్యార్థులకు 1వ అధ్యాయం, ద్వితీయ విభాగంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు 2వ అధ్యాయంలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 95053 77520 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

16న కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్ 16వ తేదీన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన పీఠం కరస్పాండెంట్, విభాగ్ సేవా ప్రముఖ్ పి.పి. గురుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద గల విజ్ఞాన పీఠంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 3, 4,5 తరగతుల విద్యార్థులకు భగవద్గీత తొమ్మిదవ అధ్యాయంలో 1 నుంచి 10 శ్లోకాల వరకు, 6,7 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 15 శ్లోకాల వరకు, 8,9 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 20 శ్లోకాల వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

సెక్టోరల్ ఆఫీసర్ల నియామకం

కర్నూలు (టౌన్) : వచ్చే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సెక్టోరల్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించింది. ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ మొహిద్దీన్, రహదారులు భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఆర్. ఫణీరామ్‌లకు గతంలో పనిచేసిన అనుభవం ఉంది. ఈనేపథ్యంలో వారిద్దరిని సెక్టోరల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు. వీరుకర్నూలు (137), పాణ్యం (138), కోడుమూరు అసెంబ్లీ (143)నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల వ్యయం పరిశీలన, ఈవీఎం, వీవీప్యాడ్‌ల నిర్వహణ వంటి విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

భగవద్గీత సహస్ర గళ పారాయణ పత్రాల ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్‌భాగ్‌లోని గీతా ప్రచార ధామం ప్రాంగణంలో స్వామి విదాయ ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో భగవద్గీత సహస్ర గళ పారాయణ పత్రాల ఆవిష్కరణ జరిగింది. బుధవారం మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, పారిశ్రామిక వేత్త టీజీ శివరాజ్, గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ, చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద, సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, ఇతర ధార్మిక సంస్థల ప్రతినిధులు పత్రాలను ఆవిష్కరించారు.

ఉత్తరాధి మఠంలో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్ సిటీలోని ఉత్తరాధి మంఠంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితుల నుంచి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య



లక్ష్మీపురంలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లక్ష్మీపురం, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దటేకూరు గ్రామాలలో పర్యటించారు. పెద్దటేకూరులో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. లక్ష్మీపురంలో ఇంకా అతిసార కేసులు వస్తున్నాయా? లేదా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆశా కార్యకర్తలు గ్రామంలో పైపులైన్లను పరిశీలించాలన్నారు. అతిసార పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంపు కొనసాగించాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి అస్వస్థతకు గురైన వారు ఉన్నారా? లేదా? అని వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు కాచి వడపోచిన నీటిని తాగాలని, ఇంటింటికి వెళ్లి క్లోరినేషన్ ట్యాబెట్లు, ఓఆర్ఎస్ అందించాలన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



నిర్వాహకులను హెచ్చరిస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామ సమీపంలోని వక్ఫ్ బోర్డు భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలకు ప్రయత్నిస్తుండడంతో ఆకస్మికంగా దాడి చేశారు. ఆయన మాట్లాడుతూ ఉల్చాల గ్రామ సమీపంలో రోడ్డు కాంట్రాక్టు పనులకు అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న నిర్వాహకులను హెచ్చరించి జేసీబీ, హిటాచీ, లారీలను అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, అక్రమంగా గ్రావెల్ తవ్వితే సహించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా క్రీడల అభివృద్ధి అధికారులుగా చీఫ్ కోచ్‌లు

- స్పోర్ట్స్ అథారిటీలో సీఈఓ పోస్టు స్థానంలో మార్పు
- జీవో 26 జారీ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాసంఘాల ప్రతినిధులు



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం

కర్నూలు (టౌన్): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సర్కారు తాజాగా స్పోర్ట్స్ అథారిటీలో సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణాధికారి) స్థానంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారులుగా చీఫ్ కోచ్‌లను నియమిస్తూ జీవో 26 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం ప్రస్తుతం చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసరావు డిసెంబర్ 1 వ తేదీ నుంచి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా వ్యవహరిస్తారు. కాగా ప్రభుత్వం నిర్ణయంపై క్రీడా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చీఫ్ కోచ్‌లను క్రీడల అభివృద్ధి అధికారులుగా నియమించడం వల్ల క్రీడాకారులకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయం క్రీడల అభివృద్ధికి దోహదం

స్పోర్ట్స్ అథారిటీల్లో ముఖ్య కార్యనిర్వహణాధికారి స్థానంలో ప్రభుత్వ చీఫ్‌కోచ్‌లను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారులుగా నియమించడంతో క్రీడారంగం మరింత బలోపేతమవుతుందని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం పక్కన ఉన్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యాలయంలో క్రీడా సంఘాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని క్రీడా సంఘాలు ఆహ్వానిస్తున్నాయన్నారు. క్రీడా పరిజ్ఞానం లేని అధికారులను స్పోర్ట్స్ అథారిటీల్లో నియమించడం వల్ల గతంలో క్రీడా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయన్నారు. సమావేశంలో దాసరి సుధీర్ (హాకీ), నాగరత్నమయ్య (విలువిద్య), శ్రీనివాసులు (హ్యాండ్ బాల్), ప్రసాద్ (టీటీ), రవికుమార్ (రైఫిల్ షూటింగ్), కోలా ప్రతాప్ (కరాటే), షేక్షావలి (వెయిట్ లిఫ్టింగ్), వేణుగోపాల్ (పవర్ లిఫ్టింగ్), ప్రభాకర్ (యోగ), పరశురాముడు (షూటింగ్ బాల్), రామచంద్రనాయక్ (సైకిల్ పోలో), చిన్న సుంకన్న (ప్రైవేట్ పీఈటీల సంఘం అధ్యక్షుడు), పవన్‌కుమార్ (ఆట్యా- పాట్యా), వెంకటేశ్వర్లు (తైక్వాండో) పాల్గొన్నారు.